# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని బద్వేల్-నెల్లూరు 4 వరుసల రహదారి అభివృద్ధికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
2. **కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ ఈరోజు, రేపు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తారు.**
3. **యోగా ప్రాముఖ్యతను తెలియజేసేలా ఆంధ్రప్రదేశ్‌లో యోగా మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
4. **కౌమార బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు 'ఇందిరమ్మ అమృతం' పథకాన్ని తెలంగాణ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఈరోజు ప్రారంభిస్తారు.**
5. **తెలంగాణలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ దోస్త్ తొలి విడత ప్రవేశాలను ఈ రోజు నుంచి కేటాయిస్తారు.**

=========================

ఆంధ్రప్రదేశ్‌లోని బద్వేల్-నెల్లూరు 4 వరుసల రహదారి అభివృద్ధికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన మంత్రి వర్గ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిన్న పాత్రికేయులకు వెల్లడించారు. రాష్ట్రంలోని బద్వేల్- నెల్లూరు రహదారిని 3,653 కోట్ల రూపాయలతో 108.134 కి.మీల పొడవున ఈ రహదారిని అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. ఈ నిర్మాణంతో ఆ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్ర మంత్రి తెలుపుతూ,

వాయిస్.. 22 సెకన్లు

మరో వైపు వరి సహా మొత్తం 14 ఖరీఫ్ పంటలకు క్వింటాల్‌పై కనీస మద్దతు ధర పెంచినట్లు తెలిపారు. ఆయా పంటలకు ధర కోసం 2.7లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

-------------------------

కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ ఈరోజు, రేపు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం లక్కిరెడ్డిపల్లిలోని మాతంగ మహా పీఠాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం రాయచోటిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర

ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారు. తర్వాత స్థానికంగా జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. కాగా రేపు తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకోనున్నారు.

---------------------------

యోగా ప్రాముఖ్యతను తెలియజేసేలా ఆంధ్రప్రదేశ్‌లో నెలరోజుల పాటు యోగ మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లాలో నిన్న రెండవ రోజు మహానాడులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... జూన్ 21న విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భీమునిపట్నం వరకు 5 లక్షల మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. అదేరోజున రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది యెగా చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలుపుతూ,

వాయిస్..15 సెకన్లు

---------------------------

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అఖిలపక్ష పార్లమెంటరీ ప్రతినిధి బృందాలు విదేశీ పర్యటనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా జెడి (యు) ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఇండోనేషియాలోని జకార్తాలో ఆ విదేశాంగ శాఖ మంత్రి హెచ్.ఈ. అరీఫ్ హవాస్ ఓగ్రోసెనో ఏఎస్ఈఏఎన్ సెక్రటరీ జనరల్ కావో కిమ్ హౌర్న్ లతో సమావేశమైంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ వైఖరి గురించి వారికి తెలియజేసింది. పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం నిర్వహిస్తున్న ప్రపంచవ్యాప్త ప్రచారంలో భాగంగా ఈ ప్రతినిధి బృందం ఇప్పటివరకు జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్లను సందర్శించింది.

---------------------------

'ఆడపిల్లలకు శక్తినిద్దాం.. ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం' నినాదంతో ప్రత్యేక పోషకాహార పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం రూపొందించింది. కౌమార బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు 'ఇందిరమ్మ అమృతం' పథకాన్ని తెలంగాణ స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఈ రోజు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెంలోమంత్రి ప్రారంభిస్తారు. రాష్ట్రలో తొలుత ప్రయోగాత్మకంగా భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అమలు చేయనున్నారు.ఇందిరమ్మ అమృతం పోషకాహారం కింద పల్లీలు, చిరు ధాన్యాలతో తయారైన చిక్కీలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలికలకు ఉచితంగా పంపిణీ చేయనుంది.

---------------------------

తెలంగాణాలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ దోస్త్ తొలి విడత ప్రవేశాలను ఈ రోజు నుంచి కేటాయిస్తామని దోస్త్ కన్వీనర్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 89 వేల 572 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని చెప్పారు. వారిలో 65 వేల 213 మంది మాత్రమే వెబ్ ఆప్షన్లు ఎంచుకున్నారని.. వారికి కళాశాలల ప్రవేశాలను కేటాయిస్తామని తెలిపారు.

---------------------------

రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత అవసరమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన నిన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ,

వాయిస్..22 సెకన్లు

---------------------------

తలసేమియా బాధితుల కోసం ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం, రెడ్ క్రాస్ సంస్థ విజయవాడ శాఖ సంయుక్తంగా నిన్న విజయవాడలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమలో 100 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం జాయింట్ సెక్రటరీ సాయి ప్రసాద్ పాత్రికేయులతో మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు ఉపయోగపడేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.

---------------------------

మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏటా జూన్ 8న జరుగుతున్న చేప ప్రసాదం పంపిణీ ప్రశాంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లపై అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ నుంచి 1.5 లక్షల చేప పిల్లలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈసారి ప్రసాదం కోసం వచ్చేవారికి అదనంగా సౌకర్యాలు కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మరోవైపు జూన్ 8, 9 తేదీల్లో ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం పంపిణీ, ఆ తర్వాత 3-4 రోజులు దూద్‌బౌలి, కవాడిగూడల్లోని నివాసాల్లో ఈ పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని బత్తిని సోదరులు తెలిపారు.

---------------------------

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు పేర్కొంటూ...

వాయిస్... 32 సెకన్లు

తెలంగాణలోనూ నైరుతి రుతుపవనాలు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఈరోజు, రేపు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ నుంచి భారతీయ జనతా పార్టీ తరపున రాజ్యసభకు జరిగిన ఉప ఎన్నికలో ఏకగ్రీవంగా ఎన్నికైన పాకా వెంకట సత్యనారాయణ రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. సత్యనారాయణతో రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ నిన్న ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేయించారు. సత్యనారాయణ 2028 జూన్ 21 వరకు రాజ్యసభ సభ్యునిగా కొనసాగుతారు.

=====================